పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

మురుగు కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్
- ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో పర్యటన

ఇబ్రహీంపట్నం, జూలై 31: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులు, పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. మురుగు కాలువలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు ఇండ్లకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఆశ కార్యకర్తలు జ్వర సర్వే చేస్తున్నారా?, మందులు ఇస్తున్నారా? తెలుసుకున్నారు. అనంతరం డంప్ యార్డు, మిషన్ భగీరథ పంపు హౌస్‌ను పరిశీలించారు. నీళ్లు ఎప్పటికప్పుడూ ఫిల్టర్ చేస్తున్నారా, ఎన్ని దశల్లో శుద్ధి చేస్తున్నారని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

రాజేశ్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్, సామాజిక సేవకుడు రమేశ్

ధర్మపురి, జూలై 31: గల్ఫ్ బాధితుడి కుటుంబానికి ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.33 లక్షలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లి గ్రామానికి చెందిన రాగుల రాజేశ్ మూడేళ్ల క్రితం ఉపాధి కోసం అప్పులు చేసి దుబాయ్ వెళ్లాడు. అక్కడికి వెళ్లిన కొద్ది రోజుల్లోనే రాజేశ్ తీవ్ర అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స అందజేసి ఇంటికి పంపించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులు చికిత్స చేయించగా కొంత కోలుకున్నాడు. మళ్లీ రాజేశ్ ఎడమ కాలుకు ఇన్ఫెక్షన్ సోకి సర్జరీ అవడంతో పాటు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. రాజేశ్ భార్య లావణ్య కూలీ పని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నది. రాజేశ్ వైద్య ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. వీరి దీన స్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ లావణ్య బ్యాంకు ఖాతా వివరాలతో జూలై 4న ఫేస్‌బుక్‌లో తన మిత్రులకు పోస్టు చేశాడు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు లావణ్య బ్యాంక్ ఖాతాలో రూ.1.33 లక్షలు జమచేయగా బుధవారం ఎస్బీఐ మేనేజర్ నరేశ్ చేతుల మీదుగా అందజేశారు. సామాజిక సేవకుడు రమేశ్, ఫేస్‌బుక్ మిత్రులకు రాజేశ్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పంచాయతీ అధికారిగా రఘువరన్

బాధ్యతలు స్వీకరిస్తున్న రఘువరన్

జగిత్యాల, జూలై 31, (నమస్తే తెలంగాణ): జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు సెలవుపై వెళ్లగా, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్‌ను నియమిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రఘువరన్ మాట్లాడుతూ, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న ఎస్పీ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు

- ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాల నియంత్రణ
- ఎస్పీ అశోక్‌కుమార్
- జగిత్యాల పట్టణంలో అవగాహన ర్యాలీ

జగిత్యాల కలెక్టరేట్, జూలై 31: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జగిత్యాల టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో హెల్మెట్ ఆవశ్యకత, సీట్ బెల్ట్ ధరించడం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 44 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, పంచాయతీరాజ్ శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో కలిసి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హెల్మెట్ వినియోగంపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐలు తిరుపతి, సుధీర్‌రావు, ట్రాఫిక్ ఎస్ఐలు రామచంద్రం, మల్లేశ్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే రైతులకు న్యాయం

రైతు కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, లోక బాపురెడ్డి

సారంగాపూర్, జూలై 31: కేసీఆర్ పాలనలోనే రైతులంతా సంతోషంగా ఉన్నామని, మళ్లీ సారే రావాలని రైతు కూలీలు స్పష్టం చేశారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి బుధవారం కోనాపూర్ గ్రామ శివారులో పొలాల్లో పని చేస్తున్న రైతు కూలీలను కలిసి వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రైతు కూలీలతో మాట్లాడుతూ, కేసీఆర్ పాలన బాగుందా, కాంగ్రెస్ పాలన బాగుందా అని అడుగగా కేసీఆర్ సార్ పాలనే బాగుందని చెప్పారు. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్, సాగు నీటికి కొరత లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, ప్యాక్స్ మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, కథలాపూర్ ఏఎంసీ చైర్మన్ నాగేశ్వర్ రావు, నాయకులు తేలు రాజు, అత్తినేని నరేశ్, లింగారెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం

రాయికల్, జూలై 31: పట్టణంలోని 12వ వార్డులో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, అధికారులు కలిసి వార్డులో మొక్కలను నాటారు. అనంతరం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటి, వార్డు ఆఫీసర్ గంగారెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతగాకే అడ్డదిడ్డం మాటలు

- కోర్టు తీర్పు తర్వాత విప్ అడ్లూరి వ్యాఖ్యలు అభ్యంతరకరం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కొప్పుల ఈశ్వర్ మాజీ మంత్రి

జగిత్యాల, జూలై 31, (నమస్తే తెలంగాణ): అభివృద్ధి చేతగాక ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అసెంబ్లీలో అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. దళితబంధు స్కీం గైడ్‌లైన్స్ సరిగ్గా లేవని, ధర్మపురి నియోజకవర్గంలో కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చాడని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అందులో ఎంతమాత్రం నిజంలేదని కొట్టిపారేశారు. బుధవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 2018లో తన కడుపుకొట్టి, కలెక్టర్ సహకారంతో గెలిచాడంటూ తనపై అడ్లూరి చేసిన వ్యాఖ్యలపై కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఆక్షేపించారు. దేశంలో ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాన్ని ఏ న్యాయస్థానం తప్పుపట్టలేదనే విషయాన్ని గుర్తెరిగి మాట్లాడాలన్నారు. ఏనాడు తాను కౌంటింగ్ హాల్‌లోకి పోలేదన్నారు. లక్ష్మణ్‌కుమార్ 2018లో కౌంటింగ్ హాల్‌లోనే ఉండి, ప్రతి ఓటును పరిశీలించుకున్న తదుపరే ఓటమిని అంగీకరించారన్నారు. ఎన్నికల ఫలితాలపై కోర్టులో కేసు వేసి, ప్రజల్లో సానుభూతి పొందాలన్న తప్పుడు రాజకీయం చేసిన వ్యక్తి లక్ష్మణ్‌కుమార్ అంటూ దుయ్యబట్టారు. హైకోర్టు 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవకతవకలు లేవని తీర్పు నిచ్చిందన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు రూ.12లక్షలు ఇస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వినతి

జగిత్యాల, జూలై 31 (నమస్తే తెలంగాణ): తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని జగిత్యాల పాత్రికేయులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం అర్బన్ తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ వరందన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు కేటాయించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పన్నాల కమలాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సందీప్‌రావు, సిరిసిల్ల వేణుగోపాల్, రాగుల గోపాలాచారి, హరికృష్ణ, బండారి ఆనందం, జహీరొద్దీన్, బండ స్వామి, డిండిగాల శ్రీనివాస్, బోయినిపెల్లి శ్రీధర్‌రావు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాల టౌన్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలం గొల్లపల్లె గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్, ఎంపీడీవో రమాదేవి, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ మేనేజర్ భరత్, ఉద్యానవన శాఖ అధికారులు శ్యాంప్రసాద్, దేవప్రసాద్, స్పందన, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

జేసీబీ ఢీకొని యువకుడి మృతి

జగిత్యాల రూరల్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామంలో బుధవారం జేసీబీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. కోరుట్ల పట్టణానికి చెందిన పోతుగంటి గౌతం(24) రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తాటిపల్లి గ్రామంలో జేసీబీ డ్రైవర్ జంగిలి పవన్ కళ్యాణ్ అజాగ్రత్తగా నడపడంతో బైక్‌పై వస్తున్న గౌతమ్‌కు తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గౌతమ్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి నెల క్రితం ఇంటికి వచ్చాడు. గౌతమ్ తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

మేడిపల్లి, జూలై 31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సమీయొద్దీన్ సూచించారు. కట్లకుంట గ్రామంలో డెంగ్యూతో బాధపడుతున్న వారి ఇంటికి బుధవారం ఆయన వెళ్లి మాట్లాడారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొడిమ్యాల, జూలై 31: డబ్బుతిమ్మాయిపల్లి, కోనాపూర్, కొడిమ్యాల గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి వాణి తనిఖీలు చేపట్టారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూరంపేట గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నాటు వేసే కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో పర్లపల్లి జ్యోతి, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, జూలై 31: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏడీఏ రాంచందర్, ఏవో వినీల తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో స్టాక్ రికార్డులు, లైసెన్సలను పరిశీలించారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈవోలు మల్లేశం, నవీద్, పవన్ పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

కోరుట్ల, జూలై 31: పట్టణ శివారులోని పోచమ్మతల్లి, మహలక్ష్మీ ఆలయాలకు వెళ్లేందుకు వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోగా బుధవారం మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం

కథలాపూర్, జూలై 31: కథలాపూర్ పీహెచ్‌సీలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులు నాగభూషణం, రష్మిత, కవిత, ఆఫీస్ సబార్డినేట్ ఎండీ ముక్తార్‌ను బుధవారం శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, సిబ్బంది శ్రీధర్, చిన్నరాజం, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

జగిత్యాల టౌన్, జూలై 31: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 4న ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తయ్యరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14, 16, 18, 20 సంవత్సరాల్లోపు బాల, బాలికలు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మెమోతో తో రావాలని సూచించారు.

షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

ఇబ్రహీంపట్నం, జూలై 31: మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి బీజేపీ మండలాధ్యక్షుడు లింగా రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు కార్యక్రమంలో నాయకులు రణధీర్, సురకంటి భూమారెడ్డి, చిన్నారెడ్డి, వెంకటేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల టౌన్/రూరల్, జూలై 31: జగిత్యాల మండలం చల్‌గల్, మోరపల్లి గ్రామాలకు గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దొంతి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'విజయవంతం చేయాలి'

సారంగాపూర్, జూలై 31: తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని సీడీపీవో వాణిశ్రీ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె సారంగాపూర్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, ఆగస్టు ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి

సారంగాపూర్, జూలై 31: గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేయాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, సురుగు శ్రీను పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం వారు ఎమ్మార్పీఎస్ జెండా గద్దె ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వంశీ, బెజ్జెంకి సతీశ్, సునీల్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో దెబ్బ తింటున్న రోడ్లు

పెగడపల్లి, జూలై 31: మండలంలోని గ్రామాల్లో రోడ్లపై ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ బిగించి నడపడంతో బీటీ రోడ్లు దెబ్బతింటున్నాయి. దీంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పౌరహక్కుల దినోత్సవం

కోరుట్ల రూరల్/పెగడపల్లి/కథలాపూర్, జూలై 31: కోరుట్ల మండలం సంగెం, పెగడపల్లి మండలం రాములపల్లి, కథలాపూర్ మండల పోసానిపేట గ్రామాల్లోని దళితవాడల్లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రామకృష్ణ, నాయబ్ తహసీల్దార్లు రాజశేఖర్, శ్రీనివాస్, ఎంఈవో ఆనందరావు, ఎంపీవో మహేందర్, ఆర్ఐలు శ్రీనివాస్, రాజేందర్‌రావు, కార్యదర్శులు శ్రీకాంత్, సులోచన, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దీకొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

వెల్గటూర్, జూలై 31: ఎండపల్లి మండలం గుల్లకోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గొల్లపల్లి విష్ణువర్ధన్ హనుమకొండలోని హ్యాండ్‌బాల్ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికయ్యారు. విష్ణువర్ధన్‌ను ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రం, వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్, భూమేశ్, మాజీ సైనికులు రమణారెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

సారంగాపూర్, జూలై 31: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన ఘటనలో కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన కనకం రంజిత్‌పై అట్రాసిటీ, పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

కథలాపూర్, జూలై 31: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ నవీన్ కుమార్ బుధవారం తెలిపారు. యువతి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధువులు, మిత్రుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామి వారి ఊరేగింపు

కథలాపూర్, జూలై 31: కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలో బుధవారం వేంకటేశ్వర స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. అడవిలో గుట్టపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆషాఢ మాసంలో గ్రామంలోకి తీసుకురావడం ఆనవాయితీ అని గ్రామస్తులు పేర్కొన్నారు. అర్చకుడు సీతారామాచార్యులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

కోరుట్ల, జూలై 31: పట్టణంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు చేశారు. వేడుకల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రతినిధులు గంగారెడ్డి, శ్రీనివాస్, అమరేందర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల రెంజర్‌గా మొహినొద్దీన్

కొడిమ్యాల, జూలై 31: కొడిమ్యాల రేంజర్‌గా బుధవారం మొహినొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన రేంజర్ మొహినొద్దీన్‌కు బదిలీపై వెళ్తున్న రేంజర్ లత పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

నంచర్ల చెరువు మత్తడి సైడ్ వాల్‌కు బుంగ

మత్తడి వద్ద సైడ్ వాల్‌కు బుంగ పడి వృథాగా పోతున్న నీళ్లు

పెగడపల్లి, జూలై 31: పెగడపల్లి మండలం నంచర్ల గ్రామ పెద్ద చెరువు మత్తడి వద్ద సైడ్ వాల్‌కు బుంగ పడి నీళ్లు వృథాగా పోతున్నాయి. గతంలో చెరువు మత్తడికి బుంగ పడడంతో, ముందు భాగంలో తాత్కాలికంగా సైడ్ వాల్ నిర్మించారు. భారీ వర్షాలకు సైడ్ వాల్ కూడా దెబ్బతిని బుంగ పడడంతో చెరువులోని నీళ్లు వృథాగా పోతున్నాయి. దీంతో చెరువు కింది ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

బుంగను పరిశీలించిన డీఈ

పెద్ద చెరువు మత్తడి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.34 లక్షలు మంజూరు చేసినట్లు నీటి పారుదల శాఖ డీఈ రమేశ్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన బుంగను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్తడి నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, వర్షాలు తగ్గాక పనులు ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఈ కీర్తిమారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, అనిల్, రమేశ్, పోలీస్ అధికారి సంపత్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు అభినందనీయం

సత్యనారాయణను సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు, ఉద్యోగులు

జగిత్యాల, జూలై 31, (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో ఎస్ఈగా గుండు సత్యనారాయణ చేసిన సేవలు అభినందనీయమని విద్యుత్ ఉద్యోగులు కొనియాడారు. జగిత్యాల ఎస్ఈ సత్యనారాయణ బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ పొందగా, జిల్లాలోని ఎన్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది, వివిధ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు, కాంట్రాక్టర్లు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈలు, ఏడీఏలు, ఏఈలు, విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఈగా గంగాధర్

జగిత్యాల ఇన్‌చార్జి ఎస్ఈగా కరీంనగర్ ఎస్ఈ వీ గంగాధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎన్పీడీసీఎల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. గంగాధర్‌ను డీఈలు, ఏడీఈలు, ఏఈలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మేడిపల్లి, జూలై 31 : ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో రఘువరన్ సూచించారు. భీమారం మండల కేంద్రంలో డెంగ్యూతో బాధపడుతున్న వారి ఇంటికి బుధవారం ఆయన వెళ్లి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, డీఎల్‌పీవో శంకర్, ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో నీరజ, డాక్టర్ రమ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఏఎన్ఎం సుమలత, ఎంఎల్‌హెచ్‌పీ సిద్ధార్థ, కారోబార్ వనిత పాల్గొన్నారు.

భీమారంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో రఘువరన్

అప్రమత్తతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

మెట్‌పల్లి రూరల్, జూలై 31: అన్నదాతలు అప్రమత్తంగా వ్యవహరించినప్పుడే విద్యుత్ ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ తిరుపతి తెలిపారు. ఆత్మకూర్ గ్రామంలో విద్యుత్ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీ మనోహర్, విద్యుత్ సిబ్బంది నవీన్, అజయ్, మధు, రైతులు, నాయకులు నేరేళ్ల శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, తీపిరెడ్డి జీవన్‌రెడ్డి, మగ్గిడి భూమారెడ్డి, దిలీప్‌గౌడ్, నరేశ్, నవీన్‌రెడ్డి, జరుపుల రవి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ఇబ్రహీంపట్నం/కథలాపూర్, జూలై 31: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇబ్రహీంపట్నం, కథలాపూర్ ఎస్ఐలు అనిల్, నవీన్‌కుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం, కథలాపూర్ మండల కేంద్రాల్లో బుధవారం వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు పూలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, జూలై 31: మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మెట్‌పల్లి, ఇతర ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చే సరికి తీవ్ర నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు.

వైద్యురాలికి గ్లోబల్ ఐకాన్ అవార్డు

మెట్‌పల్లి, జూలై 31: పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ హేమరెడ్డికి ఎక్సలెన్స్ గ్లోబల్ ఐకాన్ అవార్డు వరించింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. చాలా మందికి సంతానోత్పత్తి సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన వైద్య సేవలందించడం ద్వారా గ్లోబల్ ఐకాన్ సంస్థ నిర్వాహకులు ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. డా. హేమరెడ్డిని పలువురు అభినందించారు.

విరమణ పొందిన ఉపాధ్యాయులకు సత్కారం

జగిత్యాల రూరల్, జూలై 31: అంతర్గాం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నందల్లి మదన్‌మోహన్ రావు ఉద్యోగ విరమణ పొందగా, బుధవారం పాఠశాల ఆవరణలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, సురేశ్, బోనగిరి నారాయణ, నోముల శేఖర్, క్యాతం రాజిరెడ్డి, కిష్టయ్య, గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సింగు సత్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, జూలై 31: కొడిమ్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఇన్‌రెడ్డి కిషన్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందగా, బుధవారం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయేంద్ర, ఉపాధ్యాయులు హమీదుల్లా ఖాన్, మన్మద రెడ్డి, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, మోహనమ్మ, విమల, క్రాంతికుమార్, తిరుపతి రెడ్డి, రాజమల్లయ్య, సురేశ్, రాజ్‌కుమార్, రయిజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సారంగాపూర్, జూలై 31: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన చింతల రమేశ్‌కు రూ. 44వేలు, గుగులోతు అరుణ్‌కు రూ. 43 వేలు, కంచర్ల పుష్పలతకు రూ, 10వేలు, గీతకు రూ. 15,500 చొప్పున సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, బుధవారం లబ్ధిదారులకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ యూత్ నాయకుడు పాంపర్తి రంజిత్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అలాగే, బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మర్నావేణి నిత్యకు రూ. 60 వేల ఆర్థిక సాయం మంజూరు, నాయకులు చెక్కు అందజేశారు.

పెగడపల్లి, జూలై 31: పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి కనకవ్వకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.40 వేల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ లబ్ధిదారుకు చెక్కు అందజేశారు. నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతి, విష్ణు, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రామకృష్ణ

జగిత్యాల టౌన్, జూలై 31: జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న వై సత్యనారాయణ కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై సత్యనారాయణ, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్, జూలై 31: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంఈవో గంగాధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రాఘవులు, రమేశ్, నర్సయ్య, ఉపాధ్యాయులు రాజారెడ్డి, శ్రీనివాస్, రమేశ్, గంగరాజు, ఆపరేటర్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

కోరుట్ల, జూలై 31: ఉమ్మడి ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తామని పీఆర్‌టీయూ టీ(ఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, ఆనంద్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ శోభారాణి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కాగా, సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు అబ్దుల్ బాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సర్తాజ్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సురేఖ, యూసుఫ్ అలీ, జయప్రద పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, జూలై 31: స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్ (పోలీసు జాగిలాలు)ను ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాగిలాల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్ఐ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సత్కారం

ఏఎస్ఐలు ప్రభాకర్‌రెడ్డి, హసన్ మహ్మద్ ఉద్యోగ విరమణ పొందగా డీపీవోలో ఎస్పీ అశోక్‌కుమార్ శాలువాలతో సన్మానించారు. అనంతరం పోలీస్ వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్‌తో వీడ్కోలు పలికారు.

డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల టౌన్, జూలై 31: జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి వైఖరితో జిల్లాలోని ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం కిరణ్ బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన బదిలీల్లో స్పౌజ్ కేటగిరిలో కొంత మంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన స్థానాలకు ఆప్షన్స్ ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారని జూలై ఒకటిన డీఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.